
సాక్షి గుంటూరు

గురువారం । 18 । జూలై । 2024



వ్యర్థాలు తొలగించండి

తెనాలిఅర్బన్: పట్టణంలోని గంగానమ్మ పేటలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పర్యటించారు. రోడ్ల వెంట వ్యర్థాలను తొలగించాలని సిబ్బందికి సూచించారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 2,519 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 1,393 క్యూసెక్కులు వదిలారు.



ఆర్టీసీ ఈయూ గేట్‌మీటింగ్

నరసరావుపేట: ఆర్టీసీ డిపో మేనేజర్ వీరాస్వామి వైఖరిని నిరసిస్తూ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ కమిటీ నాయకులు బుధవారం ఆరవరోజు డిపో ఎదుట గేట్ మీటింగ్ నిర్వహించారు.

న్యూస్‌రీల్

నమో.. నారసింహా

పానకాలస్వామి చెంతకు పోటెత్తిన భక్తులు



తాడేపల్లిరూరల్: మంగళగిరి నగరంలోని లక్ష్మీ నరసింహుని సన్నిధికి బుధవారం తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే ఎగువ, దిగువ సన్నిధుల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం లోపల నుంచి గాలిగోపురం వరకు స్వామి దర్శనం కోసం బారులు తీరారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

లైంగిక దాడి ఘటనా స్థలిని పరిశీలించిన డీఎస్పీ

ప్రత్తిపాడు: నడింపాలెంలో దళిత బాలికపై లైంగిక దాడి జరిగిన ఘటనా స్థలాన్ని గుంటూరు సౌత్ జోన్ డీఎస్పీ మహబూబ్‌బాషా బుధవారం పరిశీలించారు. ఈ నెల 12న ప్రత్తిపాడు మండలం చినకోండ్రుపాడు గ్రామానికి చెందిన 13 ఏళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ వెంకట్ లైంగికదాడికి పాల్పడటం, విషయం తెలిసిన తల్లిదండ్రులు 16న ప్రత్తిపాడు పోలీసులకు పిర్యాదు చేయడం, పోక్సో చట్టంతోపాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం గుంటూరు సౌత్‌జోన్ డీఎస్పీ మహబూబ్‌బాషా నడింపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలోని పొలాల్లో లైంగిక దాడి జరిగిన ప్రాంతాన్ని ఇన్‌చార్జి ఎస్‌ఐ రవీంద్రతో కలిసి పరిశీలించారు. స్థానికులతో మాట్లాడారు. వివరాలు సేకరించారు. అట్రాసిటీ కేసు కూడా నమోదు కావడంతో విచారణ చేస్తున్నామని డీఎస్పీ తెలిపారు.

నేటి నుంచి కుష్ఠు రోగుల గుర్తింపు

ప్రత్తిపాడు: జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 18వ తేదీ నుంచి ఆగస్టు 2 వరకు కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్య శాఖ చేపట్టనుంది. లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ (ఎల్‌సీడీసీ) ద్వారా ఆరోగ్య సిబ్బంది 16 రోజులపాటు ఇంటింటికీ వెళ్లి సర్వే చేయనున్నారు. ఇందుకు సంబంధించిన యాక్షన్ ప్లాన్‌ను వైద్యాధికారులు ఇప్పటికే సిద్ధం చేశారు. కుష్ఠు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు వ్యాధిగ్రస్తులను గుర్తించనున్నారు. కుష్ఠును ప్రాథమిక దశలోనే గుర్తిస్తే మెరుగైన చికిత్స ద్వారా అంగ వైకల్యం బారిన పడకుండా ఉండవచ్చు. సర్వేలో తొలుత ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తారు. ఎవరికైనా లక్షణాలు ఉంటే ఏఎన్‌ఎంకు తెలియజేస్తారు. ఏఎన్‌ఎం మరోసారి పరీక్షించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారు. ఈ వివరాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారికి వెళతాయి. వైద్యుడు రోగిని పరీక్షించి వ్యాధి నిర్ధారణ చేస్తారు. నిర్ధారణ అయితే వారికి మెరుగైన వైద్యసేవలు అందిస్తారు. ఉచితంగా మందులు ఇస్తారు. సర్వేలో ఆశా కార్యకర్తలకు సహకరించాలని పెదగొట్టిపాడు వైద్యాధికారి మేరియునిస్ కోరారు.

మందడంలో గ్రామదేవత పోలేరమ్మకు తొలి ఏకాదశి సారె



తాడికొండ: తుళ్లూరు మండలం మందడంలో తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా అమరావతి రైతులు గ్రామ దేవత పోలేరమ్మకు సారెను సమర్పించారు. మేళతాళాల నడుమ కావడిపై ఏకాదశి సారెను ఊరేగింపుగా తీసుకొచ్చారు.

కోలుకున్న ఏడుగురు కార్మికులు

జగ్గయ్యపేట: అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారంలో జరిగిన ప్రమాదంలో గాయపడిన కార్మికుల్లో ఏడుగురు కోలుకున్నారు. వారిని ఆస్పత్రులను నుంచి డిశ్చార్జి చేశారు. బూదవాడ గ్రామంలో ఉన్న అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారంలో ఈ నెల 7న బాయిలర్ పేలిన ఘటనలో 16 మంది గాయపడ్డారు. వారిలో చికిత్స పొందుతూ నలుగురు మృతి చెందిన విషయం విదితమే. మరో 12 మంది విజయవాడ మణిపాల్, ఆంధ్రా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మంగళవారం రాత్రి ఉత్తరప్రదేశ్‌కు చెందిన అరవింద్ యాదవ్, శుభం సోమి, గుడ్డు కుమార్, దినేష్ కుమార్, నాగేంద్ర చౌరాస, బిహార్‌కు చెందిన బైబిక్ సింగ్, బూదవాడ గ్రామానికి చెందిన బాణావత్ సైదాను ఆస్పత్రుల నుంచి డిశ్చార్జి చేశారని తహసీల్దార్ శేషగిరి బుధవారం తెలిపారు.





తొలికొలుపు

తొలి ఏకాదశి సందర్భంగా బుధవారం జిల్లా వ్యాప్తంగా భక్తిపారవశ్యం పరవళ్లుతొక్కింది. ప్రముఖ వైష్ణవాలయాలు భక్తజనంతో కిక్కిరిశాయి. భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండి స్వామి, దేవేరుల దివ్య మంగళ స్వరూపాలను కనులారా తిలకించి పులకించారు. గుంటూరు బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో నెలకొన్న సందడిని చిత్రాల్లో చూడొచ్చు.



- సాక్షి, ఫొటోగ్రాఫర్, గుంటూరు

తాళ్లాయపాలెంలో నిలిచిన ఇసుక సరఫరా

- కలెక్టర్ ఆదేశించినా రోడ్డు సౌకర్యం కల్పించని ఫలితమే
- లింగాయపాలెం రీచ్‌లో మాత్రమే విక్రయాలు
- స్థానికులకే ప్రాధాన్యం ఇవ్వాలని టీడీపీ నేతల జులుం
- క్యూలైన్‌తో సంబంధం లేకుండా తమ వారికి ఇసుక లోడింగ్

తాడికొండ: తుళ్లూరు మండలం తాళ్లాయపాలెంలో ఇసుక రవాణా మూడు రోజులుగా పూర్తిగా నిలిచిపోయింది. స్వాక్షాత్తు కలెక్టర్ ఈనెల 9న స్టాక్ పాయింట్‌ను పరిశీలించి వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆదేశించినా అధికారులు పట్టించుకోలేదు. ఫలితంగా వర్షానికి దారి చిత్తడిగా మారడంతో వాహనాల రాకపోకలకు అనువుగా లేకుండా పోయింది. దీంతో ఇసుక లోడింగ్ నిలిచిపోయింది. ఒక్క లింగాయపాలెం రీచ్ మాత్రమే పనిచేస్తుండటంతో అక్కడకు వినియోగదారులు పోటెత్తుతున్నారు. అక్కడ స్థానిక టీడీపీ నాయకులు జులుం ప్రదర్శిస్తున్నారు. తమ వాహనాలకు ప్రాధాన్యం ఇవ్వాలంటూ అడ్డుపడుతున్నారు. మంగళవారం ఇసుక రీచ్ వద్ద స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వాలంటూ గొడవ చేయడంతో ఇసుక లోడింగ్ నిలిపివేసి అధికారులు పోలీసులను పిలిపించారు. పోలీసులు రావడంతో వివాదం కొంతమేర సద్దుమణిగింది. అయినా టీడీపీ నేతలు క్యూ పాటించకుండా అడ్డదారుల్లో బిల్లులు తీసుకుని లోడింగ్ చేయించుకుంటున్నట్టు వినియోగదారులు విమర్శిస్తున్నారు. అక్కడ బిల్లులు రాస్తున్న డ్వాక్రా సంఘం ప్రతినిధులకు సాధారణ టెంట్లు మాత్రమే వేయడంతో వర్షంలో ఇబ్బంది పడుతున్నారు.



వర్షానికి చిత్తడిగా మారిన తాళ్లాయపాలెం స్టాక్ పాయింట్ దారి

సమర్థంగా శాంతిభద్రతల పరిరక్షణ

- బాధ్యతల స్వీకరణ సందర్భంగా కొత్త ఎస్పీ సతీష్‌కుమార్
- దేవాలయం, చర్చి, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు
- గుంటూరు నగరంలో విస్తృత పర్యటన



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గుంటూరు జిల్లా కొత్త ఎస్పీగా ఎస్.సతీష్‌కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గుంటూరు నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)లో తొలుత ఆయన పోలీసు బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. వేదపండితుల ఆశీర్వచనం అందుకున్నారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ సమర్థంగా విధులు నిర్వర్తిస్తానని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని వివరించారు. అమరావతి రాజధాని పరిధిలోని గుంటూరు జిల్లాలో ఎస్పీగా పనిచేయడం గర్వంగా ఉందన్నారు. పోలీస్ సిబ్బంది కొరత ఉన్నా.. ప్రజా రక్షణకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. గతంలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో గంజాయి నిర్మూలనకు కృషి చేసినట్టు వెల్లడించారు. జిల్లాను గంజాయి రహితంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడతామన్నారు. నేరాలపై ఎవరివద్దనైనా సమాచారం ఉంటే కంట్రోల్ రూంకు లేదా తనకు నేరుగా తెలియజేయాలని కోరారు. అనంతరం ఎస్పీ సతీష్ కుమార్‌ను జిల్లా ఏఎస్పీలు నిచికేత్ షెల్కే (గుంటూరు తూర్పు), ఎ.శ్రీనివాసరావు (క్రైం), జీవీ రమణమూర్తి (పరిపాలన), హనుమంతు (ఏఆర్), ఎం.వెంకటేశ్వరరావు (ఎస్‌ఈబీ), డీఎస్పీలు, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు, మొక్కలు, పండ్లు అందించారు. అనంతరం ఎస్పీ నగరంలో విస్తృతంగా పర్యటించారు.

పూజలు, ప్రార్థనలు

తొలుత మంగళగిరిలోని పానకాల లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఎస్పీ పూజలు చేశారు. అనంతరం గుంటూరు నగరంలోని పాత్తూరి వారితోట వద్ద ఉన్న మర్కస్ మసీదు, కొత్తపేటలోని కుగ్లర్ ఆస్పత్రి ఆవరణలోని చర్చిల్లోనూ ప్రార్థనల్లో పాల్గొన్నారు. స్థానిక పెద్దలతోనూ మాట్లాడారు.

ఐజీ, కలెక్టర్‌తో భేటీ

గుంటూరు రేంజ్ కార్యాలయంలో రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిని ఎస్పీ సతీష్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, ఇతరత్రా అంశాలపై అనుసరించాల్సిన విషయాలపై చర్చించారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ నాగలక్ష్మిని ఎస్పీ మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందించారు.



ఏలూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠికి మొక్కను బహూకరిస్తున్న ఎస్పీ సతీష్

'సుస్తీ'మే సవాల్

- తెనాలి డివిజన్‌లో విస్తరిస్తున్న హెచ్‌ఐవీ
- ప్రతినెలా సగటున 30 వరకు కొత్త కేసులు
- ఆందోళనలో ప్రజలు
- సత్ఫలితాలివ్వని నియంత్రణ చర్యలు



తెనాలి ఏఆర్టీ సెంటర్‌లో హెచ్‌ఐవీ పరీక్ష చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్

తెనాలి అర్బన్: మళ్లీ హెచ్‌ఐవీ పంజా విసురుతోంది. తెనాలి రెవెన్యూ డివిజన్‌లో హెచ్‌ఐవీ బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. దీని కట్టడికి ప్రభుత్వాలు అనేక చర్యలు తీసుకుంటున్నా ఆశించిన ఫలితాలు రావడం లేదు. ప్రతినెలా సగటున 30 కొత్త కేసులు వస్తున్నట్టు తెనాలి ఏఆర్టీ సెంటర్ రికార్డులు చెబుతున్నాయి.

2009లో ఏఆర్టీ సెంటర్

తెనాలి రెవెన్యూ డివిజన్ పరిధిలో తెనాలి, వేమూరు, రేపల్లె నియోజకవర్గాల్లోని అన్ని మండలాలతోపాటు మంగళగిరి నియోజకవర్గంలోని దుగ్గిరాల మండలం గతంలో ఉండేవి. ఈ పరిధిలో ఉన్న 18 మండలాలలోని హెచ్‌ఐవీ రోగులు గతంలో గుంటూరు, విజయవాడల్లోని ఏఆర్టీ సెంటర్లకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకుని అవసరమైన మందులు తెచ్చుకునే వారు. హెచ్‌ఐవీ రోగుల సంఖ్య పెరుగుతుండటంతో నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఉన్నతాధికారులు 2009లో తెనాలి జిల్లా వైద్యశాలలో యాంటి రెట్రో వైరస్ థెరపీ(ఏఆర్టీ) సెంటర్ ఏర్పాటుకు అనుమతులు ఇచ్చి అందుకు అవసరమైన యంత్రాలు మంజూరు చేశారు. సిబ్బందిని నియమించారు. అప్పటి నుంచి తెనాలి రెవెన్యూ డివిజన్ పరిధిలోని హెచ్‌ఐవీ రోగులకు ఇక్కడ వైద్య సేవలు అందిస్తున్నారు. అన్ని రకాల వైద్య పరీక్షలు చేసి మందులూ ఉచితంగా ఇస్తున్నారు.

రెండేళ్ల నుంచి పెరుగుతున్న బాధితులు

తెనాలి రెవెన్యూ డివిజన్ పరిధిలో రెండేళ్ల నుంచి హెచ్‌ఐవీ బాధితుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. హెచ్‌ఐవీపై ప్రభుత్వం అనేక రకాలుగా అవగాహన కల్పిస్తున్నా రోగుల సంఖ్య పెరగడం ఆందోళన కలిగిస్తోంది. తెనాలి ఏఆర్టీ సెంటర్‌లో ప్రస్తుతం 12,983 మంది హెచ్‌ఐవీ బాధితులు చికిత్స తీసుకుంటున్నారు. వీరికి ప్రతినెలా అవసరమైన మందులు అందిస్తున్నారు.

తెనాలి ఏఆర్టీ సెంటర్ పరిధిలో జనవరి నుంచి కొత్త రోగుల సంఖ్య ఇలా..

నెల	కొత్త రోగుల సంఖ్య
జనవరి	52
ఫిబ్రవరి	37
మార్చి	39
ఏప్రిల్	49
మే	54
జూన్	38

ఏఆర్టీ సెంటర్‌లో ఇండెక్స్ టెస్టింగ్

హెచ్‌ఐవీ బాధితుల సంఖ్య పెరుగుతుండటంతో నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. దీనిలో భాగంగా నెల రోజుల క్రితం ఇండెక్స్ టెస్టింగ్ అనే కార్యక్రమాన్ని నిర్వహించాలని వైద్యులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా హెచ్‌ఐవీతో బాధపడే వారి కుటుంబ సభ్యులకు, వారితో సహజీవనం చేసే వారికి కూడా హెచ్‌ఐవీ పరీక్షలు చేస్తున్నారు. వీరిలో ఎవరికైనా హెచ్‌ఐవీ ఉన్నట్లు నిర్ధారణ అయితే వారికి కూడా జీవన ప్రమాణం పెంచే మందులు ఇస్తున్నారు. ఇప్పటి వరకు తెనాలిలో చికిత్స పొందుతున్న బాధితుల కుటుంబ సభ్యులు, వారితో సహజీవనం చేసే 80 శాతం మందికి పరీక్షలు చేస్తే వారిలోనూ 13 మందికి హెచ్‌ఐవీ ఉన్నట్లు నిర్ధారణైంది. దీనిని బట్టి చూస్తే హెచ్‌ఐవీ తెనాలి డివిజన్‌లో ఏ మేరకు విస్తరిస్తోందో అర్థమవుతోంది.

స్వీయ నియంత్రణ, అప్రమత్తత అవసరం

హెచ్‌ఐవీ రోగుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ఎవరికి వారు స్వీయ నియంత్రణ పాటించాలని, నిర్లక్ష్యం వీడాలని సూచిస్తున్నారు. అపరిచితులతో లైంగిక సంబంధాలు ప్రమాదకరమని చెబుతున్నారు. దీంతోపాటు బార్బర్ షాపులు, ఇతర ప్రాంతాల్లో సూదులు, బ్లేడుల మార్పిడి, రక్తం తీసుకునే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. అధికారులూ అవగాహన కార్యక్రమాల రూపకల్పనకు సిద్ధమవుతున్నారు.

అనుమానం ఉంటే పరీక్షలు చేయించుకోవాలి



హెచ్‌ఐవీ రోగుల సంఖ్య పెరగడం ఆందోళన కలిగిస్తోంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. సురక్షితం కాని లైంగిక సంబంధాలు కొనసాగించటం.. ఒకరు వాడిన సూదులను మరొకరు వాడటం చేయరాదు. రక్తం ఎక్కించుకునే సమయంలో హెచ్‌ఐవీ పరీక్షలు చేయించుకుని తీసుకోవాలి. ఎవరికైనా అనుమానం ఉంటే తక్షణం ఏఆర్‌టీ సెంటర్‌కు వచ్చి పరీక్షలు చేయించుకోవాలి. హెచ్‌ఐవీ నిర్ధారణ అయితే క్రమం తప్పకుండా మందులు తీసుకోవాలి.

– డాక్టర్ వి.రమ్యకృష్ణ, మెడికల్ ఆఫీసర్, ఏఆర్టీ సెంటర్, తెనాలి

తగ్గింపు ధరలకు బియ్యం, కందిపప్పు

- ప్రతి కిరాణా దుకాణంలోనూ విక్రయాలు
- కందిపప్పు కిలో రూ.160
- బియ్యం కిలో రూ.48–49
- అసోసియేషన్ నేతల అంగీకారం
- జిల్లా పౌర సరఫరాల అధికారి కోమలి పద్మ



రైతుబజారులో తనిఖీ చేస్తున్న డీఎస్‌ఓ కోమలి పద్మ

తెనాలి: రాష్ట్ర ప్రభుత్వం రైతుబజార్లలో తగ్గింపు ధరలతో ఏర్పాటు చేసిన బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రాలను జిల్లా పౌర సరఫరాల అధికారి (డీఎస్‌ఓ) పి.కోమలి పద్మ బుధవారం తనిఖీ చేశారు. గాంధీపార్కులోని రైతుబజారు, గంగానమ్మపేటలోని రైతుబజారును ఆమె సందర్శించారు. కందిపప్పు, బియ్యం నాణ్యతను పరిశీలించారు. సంబంధిత అసోసియేషన్ నాయకులను పిలిపించి సరకుల సరఫరా, నాణ్యతపై వారికి అవసరమైన సూచనలు చేశారు. నాణ్యత విషయంలో రాజీపడొద్దని స్పష్టంచేశారు. ప్రతి కిరాణా దుకాణంలోనూ ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు బియ్యం, కందిపప్పు అమ్మేలా కిరాణా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులతో చర్చించారు. పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల ప్రకారం తగ్గింపు ధరలకు విక్రయానికి వారూ సమ్మతించినట్టు కోమలి పద్మ తెలిపారు. రెండుమూడురోజుల్లో ప్రతి కిరాణా దుకాణంలోనూ కందిపప్పు కిలో రూ.160కి, బియ్యం కిలో రూ.48–49కి అమ్మేలా ఏర్పాటు చేయగలమని చెప్పినట్టు వివరించారు. షణ్ముఖ రైస్ జోన్‌లోనూ కందిపప్పు, బియ్యంను మిగిలిన రకాలతోపాటు ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు అమ్మేందుకు సంసిద్ధమైనట్టు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సీఎస్ డీటీ జీవీఎస్ఎన్ మూర్తి, రైతుబజారు ఎస్టేట్ ఆఫీసర్ టి.రామకృష్ణ, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శి పావులూరి రాంబాబు పాల్గొన్నారు.

కసాయి తండ్రి

- కన్నకూతురిపైనే లైంగిక దాడి
- మద్యం తాగినప్పుడల్లా పైశాచికత్వం
- చిన్నారి అనారోగ్యానికి గురవడంతో బయటపడిన దాష్టీకం

గుంటూరు రూరల్: కన్న కూతురిపైనే ఓ తండ్రి పైశాచికత్వాన్ని ప్రదర్శించాడు. పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. సభ్య సమాజాన్ని నివ్వెరపరిచే ఈ ఘటన గుంటూరు జిల్లా నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం వెలుగు చూసింది. సీఐ వంశీధర్ కథనం ప్రకారం మండలంలోని ఒక గ్రామానికి చెందిన 8వ తరగతి విద్యార్థిని చదువును మధ్యలోనే ఆపేసి ఇంటివద్దే ఉంటుంది. ఈ క్రమంలో పండ్ల వ్యాపారం చేసే తండ్రి మద్యం మత్తులో మూడు నెలల కిందట ఇంటివద్ద ఒంటరిగా ఉన్న కుమార్తెపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఆ తర్వాత ఎవరికీ చెప్పవద్దని చిన్నారిని బెదిరించాడు. బాలిక ఎవరికీ చెప్పకపోవటంతో మద్యం తాగినప్పుడల్లా ఆమెపై పైశాచికంగా దాడి చేశాడు. ఈ క్రమంలో బాలికకు పలు అనారోగ్య సమస్యలు తలెత్తాయి. తల్లి ఆమెను చికిత్స నిమిత్తం వైద్యుల వద్దకు తీసుకెళ్లింది. సమస్యను గుర్తించిన వైద్యులు బాలికను అడగడంతో అసలు విషయం వెలుగు చూసింది. దీంతో తల్లి పోలీసులను ఆశ్రయించింది. పోక్సో కేసు నమోదు చేసిన నల్లపాడు పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచనున్నట్టు సీఐ తెలిపారు.

బాలిక మృతి కేసులో నిందితుడి కోసం గాలింపు


నిందితుడు నాగరాజు(ఫైల్)

చేబ్రోలు: కొత్తరెడ్డిపాలెం గ్రామంలో మూడురోజుల క్రితం అనుమానాస్పదస్థితిలో మరణించిన 7వ తరగతి విద్యార్థిని పేరుపోగు శైలజ మృతికి కారకుడిగా భావిస్తున్న గ్యాస్ డెలివరీబాయ్ నాగరాజు కోసం ప్రత్యేక పోలీసు బృందాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి. ఇప్పటికే అతని బంధువులతోపాటు, మరి కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు. బాలిక తల్లినీ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు. నాగరాజు దొరికితేగానీ ఈ కేసులో చిక్కుముడి వీడే అవకాశం లేదు. బాలిక మరణం అనంతరం నిందితుడు నాగరాజు పరారయ్యాడు. అతడి కోసం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు పోలీసు బృందాలు వెళ్లాయి. తెనాలి డీఎస్పీ ఎం.రమేష్ పర్యవేక్షణలో పోలీసులు విచారణను వేగవంతం చేశారు. ఒకటి, రెండు రోజుల్లో మిస్టరీని పోలీసులు ఛేదించే అవకాశం ఉంది.

కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు బెంగళూరులో కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి హరిప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పాస్, ఫెయిల్ అయిన 18 నుంచి 28 ఏళ్ల లోపు వయసు గల అభ్యర్థులకు బెంగళూరులో 35 రోజులపాటు ఉచిత భోజన, వసతితో కూడిన శిక్షణ కల్పిస్తామని పేర్కొన్నారు. ట్యాలీ ప్లస్ జీఎస్టీ, స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్, కమ్యూనికేషన్, లైఫ్, ఇంటర్వ్యూ స్కిల్స్‌తోపాటు వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌పై అత్యుత్తమ శిక్షణ కల్పించి, శిక్షణానంతరం వివిధ సంస్థల్లో నెలకు రూ.15వేలకు పైబడిన వేతనంతో నూరు శాతం ఉద్యోగాలను చూపిస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు 90004 87423 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

డ్రాగా ముగిసిన కడప-చిత్తూరు మ్యాచ్

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో అండర్-16 అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలలో భాగంగా కడప, చిత్తూరు జిల్లాల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. తొలి ఇన్నింగ్స్‌లో 71 పరుగుల ఆధిక్యత సాధించిన కడపజిల్లా జట్టుకు 3 పాయింట్లు, చిత్తూరు జట్టుకు 1పాయింట్ లభించింది. కడపజిల్లా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 255 పరుగులు సాధించగా, చిత్తూరు జట్టు ఓవర్‌నైట్ స్కోర్ 9పరుగులతో చివరిరోజు బుధవారం బ్యాటింగ్ ప్రారంభించి 184 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని టి.జి.కృష్ణప్రసాద్ 49 పరుగులు సాధించగా కడప బౌలర్ టి.లక్షిత్ 20 ఓవర్లకు 51 పరుగులు ఇచ్చి 4వికెట్లు సాధించి చిత్తూరు బ్యాట్స్‌మెన్‌లను కట్టడి చేశాడు. దీంతో కడప జట్టుకు 71 పరుగుల ఆధిక్యత లభించింది. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

'అన్నదాత సుఖీభవ' సత్వరమే అమలు చేయాలి

నరసరావుపేట: తెలుగుదేశం నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకాన్ని త్వరితగతిన అమలుచేసి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు, కౌలు రైతు సంఘాల జిల్లా ప్రధాన కార్యదర్శులు ఏపూరి గోపాలరావు, వై.రాధాకృష్ణ బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇప్పటికే ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని, ఏరువాక పౌర్ణమి కూడా అయిపోవడంతో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. ఆర్థిక సాయం కోసం ఎదురుచూస్తున్న తరుణంలో రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన విధంగా కేంద్రం ఇచ్చిన రూ.6వేలకు సంబంధం లేకుండా అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు ఆర్థికసాయాన్ని ప్రతి రైతుతో పాటు, కౌలు రైతులకు కూడా అందజేయాలన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించే జీఓను వెంటనే రద్దు చేయించాలని విజ్ఞప్తి చేశారు.

వైకేఆర్ విద్యా ఉపకారం భేష్



విద్యార్థులకు వైకేఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేస్తున్న జిల్లా జడ్జి పార్థసారథి, న్యాయ సేవాధికార సేవా సంస్థ కార్యదర్శి లీలావతి, ట్రస్ట్ ఫౌండర్ ఏరువ సాయిరాం తదితరులు


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి
- 1,600 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రూ.50 లక్షలు పంపిణీ
- 26 ఏళ్లుగా పేద విద్యార్థులకు సాయం
- ఇప్పటివరకు రూ.10 కోట్లకుపైగా స్కాలర్‌షిప్‌లు

గుంటూరు రూరల్: విద్య ద్వారానే సమాజాభివృద్ధి సాధ్యమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి చెప్పారు. బుధవారం పెదపలకలూరులో యేరువ కోటిరెడ్డి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీనియర్ న్యాయవాది పోలూరి వెంకటరెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో 1,600 మంది ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు రూ.50 లక్షల విలువైన మెరిట్ స్కాలర్‌షిప్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను మెరిట్ ఆధారంగా ఎంపిక చేసి స్కాలర్‌షిప్పులు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ట్రస్టు ద్వారా యేరువ సాయిరాం చేపట్టిన ఈ కార్యక్రమం అద్భుతమని కొనియాడారు. ప్రస్తుతం స్కాలర్‌షిప్‌లు తీసుకున్న విద్యార్థులు ఉన్నతస్థానాలకు చేరుకుని పేద విద్యార్థులకు సాయం చేసే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఉద్యోగ రీత్యా విదేశాల్లో స్థిరపడినా సొంత జిల్లాలో విద్యాభివృద్ధి కోసం కృషి చేయడం ఆనందంగా ఉందన్నారు. తండ్రి ఆశయాలను నెరవేర్చడానికి కృషి చేస్తున్న యేరువ సాయిరాంను అందరూ స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ లీలావతి మాట్లాడుతూ 18 ఏళ్లలోపు పిల్లలు ద్విచక్ర వాహనాలు నడపడం ఎంతో ప్రమాదకరమని చెప్పారు. రోడ్డు ప్రమాదాల్లో మరణాలను నివారించేందుకు అందరూ హెల్మెట్లు ధరించాలని సూచించారు. యేరువ కోటిరెడ్డి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ యేరువ సాయిరాం మాట్లాడుతూ సొంత ప్రాంతానికి ఎంతో కొంత సాయం చేయాలనే ఉద్దేశంతో తన తండ్రి పేరుమీద ట్రస్టును ఏర్పాటు చేసినట్టు చెప్పారు. పలకలూరులో హైస్కూల్‌లో భవనం నిర్మించడంతో ఆరంభమైన స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమం విరామం లేకుండా 26 ఏళ్ళుగా దిగ్విజయంగా సాగుతోందన్నారు. మిత్రుల సహకారంతో నిరంతరం స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమం కొనసాగిస్తామని ప్రకటించారు. మొత్తం 52 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్కూలుకు రూ.36,000 చొప్పున, అలాగే డిగ్రీ బీటెక్ మెడిసిన్ వివిధ రకాలైన కోర్సులు చేస్తున్న 500 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5,000 చొప్పున అందజేశామని పేర్కొన్నారు. సుమారుగా 54 వేల డాలర్లు అంటే రూ.45 లక్షల నుంచి రూ. 50 లక్షలు ఇవ్వడం గర్వంగా ఉందన్నారు. పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ఎన్ని లక్షలు ఖర్చయినా నిరంతరం ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని వైకేఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మెంబర్ పోలూరి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో విజ్ఞాన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాతూరి రాధిక, గుళ్ళపల్లి సుధీర్, నూనె గంగాధర్ రెడ్డి, యేరువ జగదీశ్వరీ, యేరువ శ్రీవేణి, యేరువ శ్రీలలిత, పాల వరప్రసాద్, యేరువ రమణి, నూనె ఉమామహేశ్వర రెడ్డి, వెంకటకోటిరెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



దాచేపల్లి: త్యాగాలకు ప్రతీకగా నిలిచిన మొహర్రం వేడుకలను మండలవ్యాప్తంగా బుధవారం ఘనంగా జరుపుకొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని చావిడిలలో అలంకరణ చేసిన పీర్లను తెల్లవారుజామున బయటకు తీశారు. పీర్లను పట్టుకుని గ్రామ పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగించారు. పీర్లను భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. దాచేపల్లిలోని రెండు చావిడిలలో ఏర్పాటు చేసిన గంధం పీర్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్రామ పురవీధుల్లో ఊరేగింపు అనంతరం పీర్లు చావిడిల వద్దకు చేరుకున్నాయి. చావిడిల చుట్టూ ప్రదక్షిణల అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో నుంచి పీర్లు పట్టుకున్న వ్యక్తులు దాటారు. చావిడిల చుట్టూ ప్రదక్షిణలను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. చావిడిల చుట్టూ పీర్లు తిరిగిన తరువాత అవి చనిపోయాయి. చనిపోయిన పీర్లను నాగులేరులో శుభ్రం చేసిన అనంతరం చావిడిలలో భద్ర పరిచారు. దాచేపల్లితో పాటుగా గ్రామీణ ప్రాంతాల్లో కూడా మొహర్రం పండుగ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. మొహర్రం పండుగ సందర్భంగా దాచేపల్లి తిరునాళ్ల ఘనంగా జరిగింది. తిరునాళ్ల సందర్భంగా మారుమూల గ్రామాల ప్రజలు దాచేపల్లికి చేరుకుని సందడి చేశారు.

ఏఈఎల్‌సీ స్టీరింగ్ కమిటీ కన్వీనర్‌గా శ్యామ్‌కుమార్


సంఘటితంగా అభివాదం చేస్తున్న ఏఈఎల్‌సీ స్టీరింగ్ కమిటీ సభ్యులు

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): ఆంధ్ర ఇవాంజలికల్ లూథరన్ చర్చి(ఏఈఎల్‌సీ) స్టీరింగ్ కమిటీ కన్వీనర్‌గా రెవరెండ్ ఇసుకపాటి శ్యామ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం నగరంలోని ఓ ఫంక్షన్ హాలులో ఏఈఎల్‌సీ స్టీరింగ్ కమిటీ తొలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ ఏఈఎల్‌సీలో నెలకొన్న చీకటిని తరిమేసి, ఫాదర్ హెయ్యర్ ఆశయ సాధన కోసం ఏర్పాటు చేసిందే ఈ స్టీరింగ్ కమిటీ అని చెప్పారు. ఒకే అధ్యక్షుడు, ఒకే రాజ్యాంగం, ఒకే ఎన్నికల అనే నినాదంతో ముందుకు వెళతామని చెప్పారు. ఈ కమిటీలో కోర్ కమిటీ నుంచి ఆరు సినడ్‌ల నుంచి సభ్యులు ఉంటారని పేర్కొన్నారు. ఏఈఎల్‌సీని సంస్కరణల బాటలో నడపడమే తమ ఏకైక అజెండా అని పేర్కొన్నారు. రూ.లక్షల కోట్ల విలువ ఉన్న ఏఈఎల్‌సీ ఆస్తులను కొందరు వ్యక్తులు స్వార్థ ప్రయోజనాల కోసం అడ్డగోలుగా అమ్మారని ఆరోపించారు. 2025లో ఏఈఎల్‌సీ నూతన అధ్యక్షుడిని ఎన్నుకునేందుకు సంఘంలోని సభ్యులు ఉత్సాహంగా ఎదురు చూస్తున్నారని చెప్పారు. ఏఈఎల్‌సీకి అధ్యక్షుడు లేని కారణంగా కోర్టు ఏఈఎల్‌సీని కాపాడేందుకు స్టీరింగ్ కమిటీని ఏర్పాటుకు అనుమతులు ఇచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది దాసరి నవీన్, కమిటీ సభ్యులు వేదాల డైజీబాబు, మురాల రత్నరాజు, చిన్న ఎలీషా, ఆంధ్ర క్రైస్తవ విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ పి ముత్యం, బాబురావు, మేరి, జయసుధ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గుంటూరులో న్యూరో సైంటిస్ట్స్ రాష్ట్ర సదస్సు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్లు విజయ, శ్యామ్ కుమార్, కుమార్‌వేలు తదితరులు

గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ న్యూరో సైంటిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర సదస్సును ఈనెల 19 నుంచి 21 వరకు గుంటూరులో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ పమిడిముక్కల విజయ చెప్పారు. గుంటూరు కొత్తపేటలోని లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను పలువురు అసోసియేషన్ నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ విజయ మాట్లాడుతూ గుంటూరులోని శ్రీ కన్వెన్షన్ హాలులో సదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇప్పటిదాకా 200కు పైగా రీసెర్చ్ పేపర్లు వచ్చాయని తెలిపారు. సదస్సులో పేపర్, పోస్టర్ ప్రెజెంటేషన్లతోపాటు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నామని ఆమె వెల్లడించారు. ప్రతి ఒక్కరికీ మెదడు సమస్యలపై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో 21న బ్రెయిన్ హెల్త్ వాక్‌ను గుంటూరు నగరంలో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 6.30 గంటల నుంచి 7.30 గంటల వరకు ఐటీసీ హోటల్ నుంచి గుజ్జనగుండ్ల సెంటర్ వరకు వాక్ జరుగుతుందని తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా వంద కోట్ల మందికిపైగా మెదడు సమస్యలతో బాధపడుతున్నారన్నారు. ప్రతి ముగ్గురిలో ఒకరు మెదడు సంబంధిత సమస్యలతో బాధపడుతున్నట్లు ఆమె వెల్లడించారు. ప్రతి ఒక్కరూ తమ జీవిత కాలంలో ఒక్కసారైనా మెదడు సమస్యల బారిన పడతారని పేర్కొన్నారు. ప్రజలకు, వైద్యం చేస్తున్న నిపుణులకు సైతం బ్రెయిన్ చికిత్సల్లో వస్తున్న ఆధునిక చికిత్స విధానాల గురించి వివరించేందుకు రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఐ.బాబ్జీ శ్యామ్‌కుమార్ చెప్పారు. సదస్సుకు హాజరయ్యే వారికి ఆరు క్రెడిట్ హవర్స్‌ను ఏపీ మెడికల్ కౌన్సిల్ ఇస్తున్నట్లు వెల్లడించారు. 20వ తేదీ ఉదయం 10 గంటలకు రాష్ట్ర సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందని ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు చెప్పారు. ఢిల్లీ, చెన్నై, ఛండీఘర్ తదితర ప్రాంతాల నుంచి నిపుణులైన న్యూరో సర్జన్లు, న్యూరాలజిస్టులు హాజరవుతున్నట్లు వెల్లడించారు. న్యూరాలజీ, న్యూరో సర్జరీలో సీనియర్ వైద్యులు డాక్టర్ మూర్తి, డాక్టర్ విఠల్‌రావులకు లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డులు అందిస్తున్నట్లు చెప్పారు. సదస్సులో 16 గెస్ట్ లెక్చర్స్ ఉంటాయని సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ కుమార్ వేలు తెలిపారు. గోల్డెన్ అవర్ చికిత్స విధానాల గురించి వివరిస్తారని, పీజీ వైద్యులకు, యువ వైద్యులకు సదస్సు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రామ్‌తారకనాథ్, డాక్టర్ ఉప్పుటూరి అరుణ్‌కుమారి, డాక్టర్ ఉప్పాల వేదమ్మ పాల్గొన్నారు.

మా కుమార్తె మృతిపై హత్యకేసు నమోదు చేయాలి

గుంటూరు రూరల్: రెండేళ్ల క్రితం తమ కుమార్తె మరణానికి ఆమె భర్తే కారణమని, అతడిపై హత్యకేసు నమోదు చేయాలని మృతురాలి తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నట్టు సమాచారం. పల్నాడు జిల్లా సాతులూరు గ్రామానికి చెందిన బండారు ఆనంద్ గుంటూరు రూరల్ మండలంలోని రత్నగిరినగర్‌లోని తన మామ ఇంటికి వస్తూపోతూ ఉండేవాడు. ఈ క్రమంలో అదే కాలనీకి చెందిన జనని అనే యువతిని ప్రేమించాడు. ఇద్దరూ ఇళ్ల నుంచి వెళ్లిపోయి పెళ్లి చేసుకున్నారు. సాతులూరులో కాపురం పెట్టారు. ఈ క్రమంలో జనని గర్భం దాల్చింది. రెండేళ్ల క్రితం ప్రసవానంతరం ఆమె మరణించింది. గర్భిణిగా ఉన్నప్పుడు సక్రమంగా చూడకపోవడం, పౌష్టికాహారం ఇవ్వకపోవడం వల్లే తమ కుమార్తె మరణించిందని మృతురాలి తల్లిదండ్రులు ఆరోపించారు. అప్పట్లో ఈ ఘటనపై నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా ఇప్పుడు అధికార పార్టీకి చెందిన బాధితకుటుంబ సభ్యులు ఆనంద్‌పై హత్యకేసు నమోదు చేయాలని నల్లపాడు పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం. ఇదే విషయంపై రాష్ట్ర హోంమంత్రి పలు ప్రెస్‌మీట్లలో మాట్లాడారు. ఈ నేపథ్యంలో ఆనంద్‌పై హత్యకేసు నమోదు చేయాలని జనని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నట్టు తెలిసింది.

అలలపై సిరుల సాగు

- తీరంలో సముద్ర నాచు (సీ వీడ్) సాగుకు అధ్యయనం
- ఆసక్తి రేకెత్తిస్తున్న సముద్రపు కలుపు మొక్కల సాగు
- ఇటీవల అధ్యయనం చేసిన గుజరాత్ నిపుణుల బృందం


ఇండోనేషియా సాగరతీరంలో సాగవుతున్న సముద్రపు నాచు


సముద్రపు నాచు

నాగాయలంక: అపార వనరుల నిధి కడలి అనేది తెలిసిన సత్యమే. చేపలు, రొయ్యలు వంటి మత్స్య సంపదేకాదు ఎన్నో వనరులు సముద్రంలో ఉన్నాయి. సముద్రంలో సహజ సిద్ధంగా పెరిగే నాచు (సీ వీడ్)ను పలు ప్రాంతాల్లో ఔత్సాహిక రైతులు సాగుచేస్తూ లాభాలు పొందుతున్నారు. దివిసీమ ప్రాంతంలోనూ నాచు సాగుకు ఉన్న సాధ్యాసాధ్యాలపై అధ్యయనం జరుగుతోంది. తీర ప్రాంత గ్రామాల్లోని మత్స్యకారులు, ఆక్వా రైతులు సముద్రపు నాచు సాగు చేపట్టేలా శిక్షణ ఇస్తే మంచి ఫలితాలు వస్తాయన్న అభిప్రాయం వ్యక్త మవుతోంది. ఈ నేపథ్యంలో 2019లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఎండీ, సీఈఓ అర్జా శ్రీకాంత్ పర్యవేక్షణలో ఈడీ బాలసుబ్రహ్మణ్యం నేతృత్వంలో నాగాయలంక ఎదురుమొండి దీవుల్లో పర్యటించిన నిపుణుల బృందం సముద్రపు నాచు సాగు ప్రతిపాదన తీసుకొచ్చింది.

గుజరాత్ నిపుణుల అధ్యయనం

గుజరాత్ రాష్ట్రంలో సీవీడ్ కల్చర్‌ను విజయవంతంగా కొనసాగిస్తున్న టీఎస్‌సీ పర్పుల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ, గుజరాత్ ఆయిల్ పవర్ కార్పొరేషన్ నిపుణులు రామర్ విభూషణ్, హరిశంకర్ తివాకర్ కూడిన బృందం ఇటీవల నాగాయలంక, కోడూరు మండలాల పరిధిలోని సముద్ర తీర ప్రాంతాల్లో పర్యటించింది. ఈ తీర ప్రాంతంలో సముద్రపు నాచు సాగుకు ఉన్న అనుకూల, ప్రతికూల భౌగోళిక పరిస్థితులు, సాంకేతిక అంశాలను ఈ బృందం అధ్యయనం చేసిందని మత్స్య శాఖ అధికారులు తెలిపారు. తీర ప్రాంతంలో ఇప్పటి వరకు సముద్రపు చేపలు, రొయ్యలు, పీతల సాగు, కేజ్ కల్చర్‌లో పంజరపు సాగుపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులు, ఆక్వా రైతులు, ఔత్సాహికులు సముద్ర తీరంవెంట సముద్రపు నాచు సాగు చేపడితే లాభాలు వస్తాయని భావిస్తున్నారు. 2008, 2017లో స్థానిక ఔత్సాహిక ఆక్వాకల్చరిస్ట్ తలశిల రఘు శేఖర్ నాగాయలంక కృష్ణానదిలో పంజరం (కేజ్)లో సీవీడ్ కల్చర్ చేపట్టారు. ప్రభుత్వ ప్రోత్సాహం, సహకారం దొరక్క ఇబ్బందుల పాలయ్యారు. 2008లో పెంచిన నాచు కృష్ణావరదకు కొట్టుకుపోవడంతో నష్టాలపాలయ్యారు.

సముద్రపు కలుపుతో లాభాలు


నాగాయలంక సముద్ర ప్రాంతంలో ఇటీవల పర్యటించిన గుజరాత్ నిపుణుల బృందం

సీ వీడ్‌లో ముఖ్యమైనది 'కప్ ఆఫ్ ఫైకస్' అనే జాతికలుపును కొన్నిచోట్ల కేజ్ (పంజరం)లో సాగు చేస్తున్నారు. ఈ కలుపు మొక్కలను ఎండబెట్టి పొడిచేసి ఫెర్టిలైజర్లు, కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీములు, టూత్‌పేస్ట్‌లతో పాటు కాస్మొటిక్స్‌లో వినియోగిస్తారని నిపుణులు చెప్తున్నారు. ఎండిన నాచు కిలో ధర రూ.50 నుంచి రూ.80 వరకు పలుకుతుంది. ఈ నాచులో తక్కువ సాంద్రత కలిగిన ఉప్పు లభ్యమవుతున్నందున దీనిని బయోసాల్ట్‌గా వినియోగిస్తారు. కప్ ఆఫ్ ఫైకస్ కలుపు మొక్కను తమిళనాడులోని రామేశ్వరం నుంచి దిగుమతి చేసుకుంటారు. ఈ మొక్కలను 45 రోజులపాటు పెంచి ఎండబెట్టి మార్కెట్‌కు తరలిస్తారు. సీవీడ్ విత్తనం కిలో ధర రూ.10 వరకు ఉంటుంది. 200 కిలోల పచ్చి సీవీడ్ నుంచి 20 కిలోల ఎండు నాచు లభిస్తుంది. జపాన్, తైవాన్, ఇండోనేషియా వంటి దేశాల్లో సీవీడ్‌కు మంచి గిరాకీ ఉంది. మనదేశంలో తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల తీర ప్రాంతాల్లో సీవీడ్‌కు మార్కెటింగ్ ఉంది. గుజరాత్ మత్స్యకారులు 'గ్రేసీలేరియాదురా' రకం సముద్రపు నాచును ఏడాదికి రెండు పంటలు సాగుచేస్తున్నారు.

సముద్రపు నాచుతో బహుళ ప్రయోజనాలు



సీవీడ్‌లో ముఖ్యమైన 'కప్ ఆఫ్ ఫైకస్' జాతి సముద్రపు నాచుతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయి. యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు అధికంగా ఉండటంతో దీనిని టూత్‌పేస్ట్, డెయిరీ ప్రొడక్ట్స్, జల్లీలో వినియోగిస్తారు. ఈ నాచు కారణంగా నీటిలో ఆక్సిజన్‌కు కొరత ఉండదు. తీర గ్రామాల్లోని మత్స్యకారులు తమ జీవన విధానంలో ఎదుర్కొంటున్న ఒడిదొడుకులు, ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకునే ఇటీవల గుజరాత్ నిపుణుల టీమ్ పర్యటించి అధ్యయనం చేసింది. కోస్తా తీరప్రాంతంలో మత్స్యకారులు ఆదాయ వనరులను పెంపొందించడానికి సీవీడ్ కల్చర్ అనువుగా ఉంటుందన డంలో సందేహం లేదు.

– రాంపురపు ప్రతిభ, ఫిషరీస్ ఏడీ, అవనిగడ్డ

అదనపు ఆదాయం ఇస్తుంది



నాగాయలంక కృష్ణానదిలో నిపుణుల ప్రోత్సాహంతో రెండు, మూడు పర్యాయాలు సీ వీడ్‌ను సాగు చేశాను. వరదవల్ల, ఉప్పుశాతం అధికం, ఎండ వేడి ఎక్కువ కారణాలతో విజయవంతం కాలేకపోయాను. అన్నీ అనుకులంగా ఉండేలా ప్రభుత్వం ప్రణాళికలతో ముందుకొస్తే తీరప్రాంత మత్స్యకారులు, ఆక్వారైతులకు అదనపు ఆదాయం తప్పక లభిస్తుంది. ఒకసారి చేసి వదిలేయకుండా రకరకాల పద్ధతుల్లో ప్రభుత్వ పక్కాప్రణాళికలతో సాగుచేస్తే సముద్రపు నాచు మంచి రాబడి మార్గమే అవుతుంది.

–తలశిల రఘుశేఖర్, ఔత్సాహిక ఆక్వా కేజ్ కల్చరిస్ట్, నాగాయలంక

నిమ్మకాయల ధరలు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4000, గరిష్ట ధర రూ.5300, మోడల్ ధర రూ.4800 వరకు పలికింది.

అనుమానాస్పదస్థితిలో రైల్వే ఉద్యోగి మృతి


మృతుడు గద్దల సురేష్ (ఫైల్)

కంభం: అనుమానాస్పదస్థితిలో రైల్వే ఉద్యోగి మృతి చెందిన సంఘటన బుధవారం రావిపాడు రోడ్డులోని కొండపై వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే..బాపట్ల జిల్లా మార్టూరు మండలం ద్రోణాదుల గ్రామానికి చెందిన గద్దల సురేష్(27) రైల్వేలో గ్యాంగ్‌మేన్‌గా పనిచేస్తున్నాడు.నాలుగు నెలల కిందట బంధువుల అమ్మాయితో వివాహమైంది. ఇటీవల బదిలీపై కంభం రాగా భార్య, తల్లితో కలిసి అక్కడే నివాసముంటున్నాడు. గత నెల 17న ఇంట్లో ఉన్న సమయంలో ఉదయం 11 గంటలకు ఫోన్ రాగా బయటకు వెళ్లాడు. ఎంతసేపటికి తిరిగి రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో నెల రోజుల తరువాత బుధవారం రావిపాడు రోడ్డులోని శ్మశానం వద్ద కొండపై మృతదేహాన్ని గుర్తించి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

హత్యా..ఆత్మహత్య..?

ద్రోణాదులకు చెందిన కోటయ్యకు ఇద్దరు కుమారులు కాగా మృతుడు సురేష్ చిన్నవాడు. కుమారుడికి ఎవరితో గొడవలు లేవని, చాలా మంచి వాడని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. నాలుగునెలల కిందట బంధువుల అమ్మాయితో పెళ్లి చేశామని, ఇంతలోనే ఇలా జరిగిందని తల్లిదండ్రులు రోదిస్తున్నారు. అయితే, ఇంట్లో ఉన్న సమయంలో ఫోన్ ఎవరు చేశారు? ఆ ఫోన్ వచ్చిన వెంటనే ఎందుకు వెళ్లాడు ? ఆ తర్వాత ఏం జరిగిందన్నది? పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. మృతదేహం ఉన్న పరిసరాల్లో ఎటువంటి ఎటువంటి అనుమానాస్పద వస్తువులు కన్పించలేదు. అక్కడికి వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడా? ఎవరైనా తీసుకెళ్లి హత్య చేశారా? అనే విషయాలు విచారణలో తేలాల్సి ఉంది. కుమారుడికి మృతికి కారణమేంటో విచారించి తమకు న్యాయం చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. సంఘటనా స్థలంలో మృతుడి భార్య, కుటుంబసభ్యులు బోరున విలపించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.